క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఉయ్యాలవాడ: మండలంలోని ఆర్.పాం పల్లెలో గంగమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో మొదటి రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. రథం ముగ్గు వేయడం, ఒంటి కొమ్ము బొల్లేవు గ్రామ ప్రవేశం, గుడి ముందు పెద్దిరాజు కథ భక్తులకు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

డెంగ్యూ బారిన పడొద్దు

రుద్రవరం: డెంగ్యూ జ్వరం బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారిణి శ్రావణి సూచించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు ఉత్పత్తి కాకుండా నీటి నీల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద నీటిని నిల్వ చేసుకునే తొట్లు, డబ్బాలపై మూతలు మూసి ఉంచాలని ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

దొర్నిపాడు: కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా ఉండాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ సూచించారు. కిశోరి వికాసం వేసవి శిక్షణా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దొర్నిపాడులోని అంగన్‌వాడీ కేంద్రం–3లో రక్తహీనత గూర్చి అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని సూచించారు. బాలికలు చదువుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. చదువు గొప్పతనంపై తల్లిదండ్రులకు పిల్లలే వివరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటసుబ్బమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డు పొందాలి

దొర్నిపాడు: కౌలు రైతులు ప్రభుత్వ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని ఏడీఏ సుధాకర్ సూచించారు. మండలంలోని చాకరాజువేముల గ్రామంలో శుక్రవారం కౌలురైతుల సమావేశం నిర్వహించారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం జరిగితే కౌలు గుర్తింపు కార్డుతో పరిహారం వచ్చే అవకాశం ఉందన్నారు. మద్దతు ధర, అన్నదాత సుఖీభవ వంటి పథకాలకు గుర్తింపు అవసరం అవుతుందన్నారు. కౌలు కార్డు పొందాలంటే ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, భూయాజమాని పొలం పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, తదితర ధ్రువపత్రాలను వీఆర్‌ఓకు అందజేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఏఓ మురళీకృష్ణ

గోస్పాడు: కౌలుకు సాగు చేసే రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి అని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. గోస్పాడు మండలం ఎం.కృష్ణాపురం గ్రామంలో శుక్రవారం ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే పథకాలకు కౌలు హక్కు పత్రాలు అవసరమన్నారు. వీటి ద్వారా పంట రుణాలకు, దిగుబడులు అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. భూయజమానులు పంట సాగు హక్కు పత్రాలు ఇవ్వడానికి కౌలు రైతులకు సహకరించాలన్నారు. కౌలు దారులకు కేవలం సాగు చేసిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందని తెలిపారు. వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సభ్యత్వాలకు ఆహ్వానం

నంద్యాల (వ్యవసాయం): కళారాధన సాంస్కృతిక సంస్థ నంద్యాల సర్వసభ్య సమావేశం ఈనెల 18వ తేదీ ఉదయం 9 గంటలకు మధుమణి నర్సింగ్ హోమ్ సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మధుసూదన్ రావు, రవికృష్ణ తెలిపారు. కళారాధనలో కొత్తగా చేరాలనుకునే కళాకారులు, కళాభిమానులు సభ్యత్వం తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

నియామక పత్రాల అందజేత

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు. దిశా డాన్ బోస్కో సహకారంతో నిర్వహించిన జాబ్ మేళాను జాన్సన్ గ్రూప్ ప్రతినిధి ఫాదర్ జాన్ దేవదాసు పర్యవేక్షించారు. మొత్తం 1500 మంది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు. 24 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేశారు.

అధిక రక్తపోటు.. ప్రాణాలకు చేటు

- జాగ్రత్తలు, అవగాహనతోనే బీపీకి చెక్
- వయస్సుతో సంబంధం లేకుండా పెరుగుతున్న బాధితులు
- పరిమితి లేని ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడే కారణమంటున్న వైద్యులు
- నేడు వరల్డ్ హైపర్ టెన్షన్ డే

గోస్పాడు: ప్రసుత సమాజంలో ప్రజలు ఉరుకులు పరుగుల జీవనాన్ని సాగిస్తున్నారు.దీంతోచిన్నా, పెద్దా తేడా లేకుండా అధిక రక్తపోటు(బీపీ) బారిన పడే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఆధునిక జీవన శైలి వల్ల పలు రకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. వీటిలో ముఖ్యంగా హైపర్ టెన్షన్ అత్యంత ప్రమాదకరమైంది. అధిక రక్తపోటు వల్ల గుండె, మెదడు, నరాలు, కిడ్నీలపై చెడు ప్రభావాన్ని చూపి అనారోగ్యం బారిన పడేయడంతో పాటు ఒక్కోసారి పక్షవాతం, గుండెపోటు, ఇతర తీవ్ర అనారోగ్యాలతో ప్రాణాలకు హాని చేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రక్తపోటు స్థాయి సాధారణ స్థాయి కన్నా పెరగడాన్నే హైపర్ టెన్షన్ అంటారు. ఒక వ్యక్తి గుండె సాధారణ స్థితిలో బ్లడ్ ప్రెషర్ (బీపీ) 120/80గా పేర్కొంటారు. తాజాగా ప్రపంచ ఆరోగ్య సంస్థ 140/90గా ఉన్నా సాధారణ స్థితిగానే పరిగణించాలని సూచించింది. చాలా మందికి బీపీ ఉందన్న విషయాన్ని గమనించేలోపు ఆ వ్యాధి వల్ల కలిగే అనర్థాలతో శరీరంలోని పలు ఆవయవాలు దెబ్బతింటుండగా, ఒక్కోసారి జరగాల్సిన నష్టం కూడా జరిగిపోతుంది. శనివారం ప్రపంచ హైపర్ టెన్షన్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ఎలాంటి లక్షణాలు కనిపించకనే..

బీపీ పూర్తి ఎక్కువగానో, లేక మరీ తక్కువగానో ఉంటే తప్ప బయట పడే పరిస్థితి లేదు. ఏదైనా సందర్భాన్ని బట్టి ఇతర జబ్బులతో వెళ్తే తప్ప బీపీ బయట పడని పరిస్థితులు ఉంటున్నాయి. ఎలాంటి లక్షణాలు కనిపించకనే బీపీ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. బీపీ రెండు రకాలు. 40 సంవత్సరాలు పైన వారు ప్రైమరీ హైపర్ టెన్షన్, 40 ఏళ్లలోపు సెకండరీ హైపర్ టెన్షన్‌గా ఉంటుంది. 15 ఏళ్లు దాటిన వారిలో 22. 6 శాతం, 60 ఏళ్లు పైబడిన వారిలో 48.4 శాతం బీపీ బారిన పడుతున్నారు. వారిలో అర్బన్ ప్రాంతాల్లో 33.8 శాతం, రూరల్ ప్రాంతాల్లో 27.6 శాతం మందికి బీపీ ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించినట్లు వైద్యులు చెబుతున్నారు. శరీరంలో రక్తాన్ని అన్ని రక్తనాళాలకు గుండె ఒత్తిడి(ప్రెజర్) చేసి పంపిస్తుంది. అధిక రక్తపోటును సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తారు. చాలా మందికి రక్తపోటు లక్షణాలు ఉన్నట్టు కూడా తెలియకపోవడం వల్ల ఉన్నట్టుండి గుండెపోటు వచ్చి కుప్పకూలిపోతారు. తల నొప్పి, అలసట అనిపిస్తే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించి బీపీ చెక్ చేయించుకోవాలి. నేటి ఆధునిక పరిస్థితుల్లో వచ్చిన మార్పులతో హైపర్ టెన్షన్ ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి బీపీ చూపించుకోవడం ఉత్తమం. బ్లడ్ ప్రెషర్ పెరిగితే ఒక్కోసారి మెదడు, గుండెలోని నరాలు దెబ్బతిని పక్షవాతం, కిడ్నీ, సమస్యలు, నరాల సమస్యలతో ప్రాణాపాయ స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది.



ఎన్‌సీడీ సర్వేలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

జిల్లాలో ఇలా..

జిల్లాలో ఎన్‌సీడీ 3.0 సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 14,33,655 మందికి పరీక్షలు చేయాల్సి ఉండగా ఇప్పటికే 9,58,518 మందికి పరీక్షలు పూర్తి చేశారు. అయితే వీరిలో 18 నుంచి 19 ఏళ్ల వరకు 288 మంది, 20 నుంచి 29 ఏళ్ల మధ్య 2168 మంది, 30 నుంచి 39 ఏళ్ల వరకు 7055మంది, 40 నుంచి 49 ఏళ్ల వరకు 21,116, 50 నుంచి 59 ఏళ్ల వరకు 37,100 మంది, 60 ఏళ్లు పైబడిన వారు 65,861 మంది సహా మొత్తం 1,33,588 మంది బీపీతో బాధపడుతున్నట్లు నిర్ధారణ అయ్యింది.

బీపీ వచ్చేందుకు కారణాలు

సాధారణంగా అధిక రక్తపోటు వయసు పైబడిన వారిలో వస్తుంది. జన్యుపరమైన కారణాలు, వంశపారంపర్యంతో వచ్చే అవకాశం ఉంది.తీవ్ర ఒత్తిళ్లు, ఆహారపు అలవాట్లు, శరీరానికి తగినంత వ్యాయామం లేకపోవడం, ఆల్కహాల్, పొగతాగే అలవాటు, డ్రగ్స్ వినియోగం, ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, కంటికి సరిపడా నిద్రలేకపోవడం, దీర్ఘకాలిక మూత్రపిండాల జబ్బు ద్వారా బీపీ వస్తుంది.

లక్షణాలు

- అధికంగా బీపీ ఉన్న వారికి తల వెనుక భాగంలో తీవ్రమైన తలనొప్పి వస్తుంది.
- పనిలో అలసట, వికారం, వాంతులు, తల తిరగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.
- అధిక రక్తపోటు ఉండేవారికి కంటి చూపు దెబ్బతినే ప్రమాదం ఉంది.
- గుండెదడ, నడిస్తే ఆయాసపడటం.
- కొందరికి ముక్కు నుంచి రక్తం కారుతుంది.
- ఒళ్లంతా చెమటలు, కాళ్ల తిమ్మిర్లు రావడం.

ఈ అలవాట్లతో బీపీ నియంత్రణ

- ఆహార నియమాలు పాటించాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
- మానసిక ఒత్తిడికి దూరంగా ఉండడం.
- ఆహారంలో ఉప్పు తగ్గించుకోవాలి.
- జన్యుపరమైన సమస్యలు ఉన్న వారు వారానికోసారి బీపీ చెక్ చేసుకోవాలి.
- తల్లిదండ్రులకు బీపీ ఉంటే అప్రమత్తంగా ఉంటూ స్మోకింగ్, ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి.
- ప్రాసెసింగ్ ఫుడ్, నిల్వ ఉండే పచ్చళ్లు తినకుండా ఉండడం మంచిది.
- యోగా,ధ్యానంతో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు

ముందస్తు జాగ్రత్తలతో ఆయుష్షు



బీపీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే హైపర్‌టెన్షన్ డేను నిర్వహిస్తున్నారు. ఆధునిక జీవన శైలిలో వయసుతో సంబంధం లేకుండా రక్తపోటు బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రతిఒక్కరూ ఈ వ్యాధిపై అవగాహన కలిగి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆహారంలో ఐదు గ్రాములకు మించి ఉప్పును తీసుకోకూడదు. ప్రతిరోజు వ్యాయామం చేయాలి. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. తరచూ బీపీ పరీక్ష చేయించుకోవాలి.

–డాక్టర్ మదన్‌మోహన్‌రావు, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ, నంద్యాల ప్రభుత్వాస్పత్రి

ఒత్తిడి లేకుండా చూసుకోవాలి



ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండేందుకు ప్రయత్నించాలి. అధిక నూనె, కొవ్వు పదార్థాలు తీసుకోకుండా పరిమిత ఆహరం తీసుకోవాలి. బీపీ ఉన్నట్లు ఒక్కోసారి తెలియకపోవచ్చు. అధిక రక్తపోటుకు గురైతే పలు అనారోగ్య సమస్యలు తలెత్తి ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంది. తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు నియమ నిబంధనలతో అదుపులో ఉంచుకోవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రిలో బీపీ మందులను ఉచితంగా అందిస్తున్నాం.

–డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ, నంద్యాల

నేటి నుంచి ఉరుసు

చాగలమర్రి: మండల కేంద్రంలోని చెరువు కట్టపై వెలసిన దస్తగిరి స్వామి ఉరుసు మహోత్సవం శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఉత్సవాల్లో భాగంగా 17న గంధం, 18న ఉరుసు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి ఆలంసాగారి మౌలాళి ఇంటి నుంచి సాంప్రదాయ మేళతాళాలు, భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపుగా మెయిన్ బజారు గుండా దస్తగిరిస్వామి దర్గా వరకు ఊరేగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన పీఠాధిపతి అబ్దుల్‌హక్ శిశ్య బృందంతో హాజరుకానున్నట్లు చెప్పారు. ఉరుసు రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. అలాగే ఉరుసు సందర్భంగా 17న ఉదయం 7 గంటలకు ఒంటెద్దు బండలాగుడు పోటీలు, 18న ఉదయం 7 గంటలకు 6 పళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అకాల వర్షంతో అవస్థలు



ధాన్యంపై కప్పి ఉంచిన టార్పాళ్లపై నీరు

ఉయ్యాలవాడ: మండలంలో గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. 28 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అకాల వర్షాలకు రైతుల కష్టం నేలపాలవుతూనే ఉంది. ఉయ్యాలవాడ, ఇంజేడు, కొండుపల్లె, పెద్దయమ్మనూరు, తదితర గ్రామాలలో మిరప, మొక్కజొన్న దిగుబడులు కళ్లాల్లో, రహదారులపై ఆరబెట్టుకున్నారు. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పట్టలు కప్పుకునేందుకు సమయం లేకపోవడంతో దిగుబడులు నేలపాలయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

గోస్పాడు: దోమకాటుతోనే డెంగీ తదితర విష జ్వరాలు వస్తాయని.. ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మలేరియా అధికారి కామేశ్వరరావుతో కలిసి డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి సాయిబాబానగర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి



సమీక్షలో మాట్లాడుతున్న సంపత్

నంద్యాల(న్యూటౌన్): పారిశుద్ధ్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ అండ్ డెరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికాని సంపత్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆరు మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ప్రతి మున్సిపాలిటీలో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి చెత్త సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు సమన్వయంతో మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. డోన్, నంద్యాల, ఆత్మకూరు, బేతంచెర్ల, ఆళ్లగడ్డ మున్సిపల్ కమిషనర్లతో పాటు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు కృషి చేయాలి



డెంగ్యూ నివారణపై ఏఎన్‌ఎంలు,ఆశా కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారిణి అంజలి

చాగలమర్రి: డెంగ్యూ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని చాగలమర్రి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.అంజలి సిబ్బందికి సూచించారు. జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చాగలమర్రిలో వైద్యారోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించాలన్నారు. గర్భవతులను గుర్తించి ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో వారి పేర్లు నమోదు చేయాలని, అలాగే ఎంసీపీ కార్డును అందజేసి వారికి ఆరోగ్యాన్ని కాపాడేందుకు కావలసిన అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి డెంగ్యూ నివారణపై అవగాహన కల్పిస్తామంటూ ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. సూపర్‌వైజర్ శివరామలింగారెడ్డి, సీహెచ్‌ఓ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం పోతేగానీ స్పందించరా?



ఉయ్యాలవాడలో దుకాణాదారుకు నోటీసు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి

ఉయ్యాలవాడ: ఒక నిండు ప్రాణం బలైన తర్వాతే మండల స్థాయి అధికారుల్లో చలనం వచ్చింది. వివరాలు.. సౌభాగ్య (పేడ రంగు) పొడి మనుషుల ప్రాణాలు హరిస్తోందని కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో గత ఏప్రిల్ 23న జిల్లావ్యాప్తంగా నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు దుకాణాదారులకు, ప్రజలకు నోటీసులు అందజేయాలని తహసీల్దార్ కార్యాలయాలకు ఆదేశాలు జారీ చేశారు. అయితే మండల పరిధిలోని ఆర్.పాంపల్లె గ్రామంలో ఈ నెల 14వ తేదీన ఓ వివాహిత లలిత పేడ రంగు సేవించి మృతి చెందింది. దీనిపై పత్రికల్లో వార్తలు ప్రచురితమైన తర్వాతే అధికారుల్లో కదలిక వచ్చింది. ఈ నెల 15వ తేదీ నుంచి పేడ రంగు విక్రయాలపై నిషేధం విధిస్తూ మండలంలోని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది దుకాణాదారులకు నోటీసులు అందజేయడం ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాలు నిర్లక్ష్యం చేయడంతోనే ఒక నిండు ప్రాణం కోల్పోవలసి వచ్చిందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు

చాగలమర్రి: స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో, ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సందర్భంగా జమ్మూకశ్మీర్‌లో పహల్గాం వద్ద ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన సాధారణ పౌరులకు, యుద్ధంలో వీరమరణం చెందిన జవాను మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్ రెవెన్యూ శాఖ ప్రగతిని తెలుపుతూ.. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ, పాత రేషన్ కార్డులలో కుటుంబ సభ్యుల తొలగింపు, చేర్పులకు అవకాశం కల్పించిందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపీపీ వీరభద్రుడు మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం తిప్పనపల్లె గ్రామం వద్ద పిడుగుపాటుకు గురై వ్యక్తి మృతి చెందినా అధికారులు సందర్శించలేదని, ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందేలా చూడాలన్నారు. నివేదికను నంద్యాల ఆర్డీఓకు పంపుతున్నామని డిజాస్టర్ లాస్ కింద రూ.4 లక్షల సాయం మంజూరవుతుందన్నారు. ఈఓపీఆర్డీ సమీక్షిస్తూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు. ఓహెచ్‌ఎస్ ట్యాంకులు లేని గ్రామాలపై కార్యదర్శులు నివేదిక అందజేస్తే ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ, పశువైద్య, ఐసీడీఎస్, అటవీశాఖ, ఆర్‌టీసీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు, విద్యుత్తు తదితర శాఖలకు చెందిన మండల అధికారులు ఆయా శాఖల అభివృద్ధిపై సమీక్షించారు. వైస్ ఎంపీపీ ఆశీర్వాదమ్మ, బేబమ్మ, వెంకటలక్ష్మీ, ఎంపీటీసీలు ఫయాజ్, లక్ష్మీరెడ్డి, సర్పంచ్‌లు రేనాటి బాలీశ్వరరెడ్డి, గోవిందయ్య, షరీఫ్, అధికారులు సాయిబాబా, రమణయ్య, రంగనేతాజీ, సుశీల, దానం, నాగేశ్, తాహెర్‌హుసేన్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు తిరంగా ర్యాలీ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల టెక్కె మార్కెట్ యార్డు నుంచి గాంధీ చౌక్ వరకు ఆదివారం ఉదయం 8 గంటలకు తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. వివిధ పార్టీలు, సంఘాలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దేశ ఐక్యతను చాటుదామన్నారు.

లీకేజీతో నీటి సరఫరా బంద్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని టెక్కెలో అమృత్ పంపింగ్ పైప్‌లైన్ లీకేజీ కారణంగా పలు కాలనీలకు నీటి సరఫరాను బంద్ చేస్తున్నట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ కాలనీకి వెళ్లే టెక్కె జంక్షన్ వద్ద పైప్‌లైన్ లీకేజీ ఏర్పడడంతో వాటి మరమ్మతుల కారణంగా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. కమాండ్ కంట్రోల్ నంబర్ 77027 76048 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్‌బీఐ కాలనీ, హౌసింగ్‌బోర్డు, విశ్వనగర్, ఎన్‌జీఓ కాలనీ, లలితానగర్, సరస్వతినగర్, గిరిన్నాథ్‌సెంటర్, రెవెన్యూ క్వార్టర్స్, సాయిబాబానగర్, విజయనగరి కాలనీ, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్, తదితర ఏరియాలకు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఎన్‌సీడీ సర్వేపై సమీక్ష



ఏఎన్‌ఎంలకు సర్వే పరికరాలను అందజేస్తున్న వైద్యాధికారులు

చాగలమర్రి: స్థానిక పీహెచ్‌సీ సమావేశ భవనంలో శుక్రవారం ఎఫ్‌డీపీ జిల్లా నోడల్ అధికారి జగదీశ్ చంద్రారెడ్డి ఆధ్యక్షతన ఎన్‌సీడీ సర్వేపై ఆశ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించి అనుమానితుల పేర్లను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అలాగే సర్వేకు కావలసిన పరికరాలను ఏఎన్‌ఎంలకు అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు సర్వే 89% పూర్తయ్యిందని చెప్పారు. ఈ నెలాఖరులోపు వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.అంజలి, సూపర్‌వైజర్ శివరామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం



ఆలమూరు వద్ద మిర్చి నారు నాటుతున్న కూలీలు



రుద్రవరం సమీపంలో సేద్యం చేస్తున్న రైతన్న

రుద్రవరం: మండలంలోని 42 గ్రామాల్లో రైతన్నలు ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. ఇందుకు సంబంధించి పొలాల్లో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. గత రబీకి సంబంధించి పంట వ్యర్థాలను తొలగించి వాటిని కుప్పలుగా పోసి తగలబెడుతున్నారు. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో సేంద్రియ ఎరువు (పశువుల పేడ)ను తరలించి పొలాల్లో చల్లించడం, సేద్యాలు చేయించడం వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే మండలంలో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో కొందరు రైతులు ఓ అడుగు ముందుకేశారు. రుద్రవరం, ఆర్.నాగులవరం, రెడ్డిపల్లె, ఆలమూరు, చిలుకలూరు, చిత్రేనిపల్లె తదితర గ్రామాల్లో 50 ఎకరాల్లో మిర్చి, 20ఎకరాల్లో మొక్కజొన్న నాటారు. దీంతో చుట్టుపక్కల ఉన్న రైతులు కూడా వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు వ్యవసాయ పనులను వేగవంతం చేశారు. మండలంలో దాదాపు 16 వేల హెక్టార్ల సాగు భూమి ఉండగా ఖరీఫ్‌లో 11 నుంచి 12 వేల హెక్టార్లలో వరి, మొక్కజొన్న, మినుము, మిర్చి, పత్తి, అరటి, బొప్పాయి, వేరుశనగ వంటి పంటలను రైతులు సాగు చేస్తారు. ఈ ఏడాది కూడా అదే మోతాదులో పంటలు సాగయ్యే అవకాశం ఉంది.



కోటకొండ వద్ద పొలంలో వ్యర్థాలను తగలబెట్టిన దృశ్యం

రైల్వేస్టేషన్‌లో మృతదేహం లభ్యం

బొమ్మలసత్రం: నంద్యాల రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై వీరరాజు (60) అనే వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ కుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 2పై వ్యక్తి మృతిచెందినట్లు సమాచారం అందిందన్నారు. వెళ్లి పరిశీలించగా అతని చొక్కా జోబిలో కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన ఓపీ చీటి ఉందని.. అందులో అతని పేరు వీరరాజుగా గుర్తించామన్నారు. బంధువులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.